
సాక్షి
జగిత్యాల

గురువారం । 28 । మార్చి । 2024



మామిడిలో చీడపీడలు

జిల్లాలో సాగవుతున్న మామిడికి ఈ ఏడాది చీడపీడలు అధికమయ్యాయి. దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. -8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు(సా॥)	సహార్ శుక్ర(ఉ॥)
కరీంనగర్	6.27	4.45
పెద్దపల్లి	6.34	4.51
రాజన్న సిరిసిల్ల	6.34	4.51
జగిత్యాల	6.34	4.51

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/26.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండవేడిమి మరింత పెరుగుతుంది. వేడిగాలులు కొనసాగుతాయి. ఉక్కపోత అధికమవుతుంది.



ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

రామాలయంలో విప్ 'అడ్లూరి' పూజలు

పెగడపల్లి: పెగడపల్లి మండలం ల్యాగలమర్రిలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు గుర్రాల త్రినాథ్‌రెడ్డి, సౌమ్యరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, ఎంపీటీసీ అంజయ్య పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఎల్లమ్మతల్లికి ఎమ్మెల్యే సంజయ్ పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి, హన్మాజీపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి పట్నాలు, బోనాల పండుగలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు నిర్వాహకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రజిత, దామోదర్, నాయకులు రవిగౌడ్, అంజిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎల్లమ్మతల్లి సిద్దోగంలో విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: కథలాపూర్ మండలం తుర్తి గ్రామంలో రేణుక ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలను గీతకార్మికులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, జవ్వాజి ఆదిరెడ్డి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకట్రావ్‌పేటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మార్నింగ్ వాక్‌లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్:మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మండలంలోని వెంకట్రావ్‌పేటలో పర్యటించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో అభివృద్ధి పనుల అమలు తీరును పరిశీలించారు. సమస్యలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేందుకే గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, ఎంపీటీసీ తోట సుజాత, మాజీ సర్పంచ్ జోగుల మమత, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన డీఎస్పీ



తనిఖీలు చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్: మండలంలోని కలిగోట చెక్‌పోస్టును మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు.

10 గంటల్లోపు పనులు పూర్తి చేయాలి



రంగపేటలో ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న మదన్‌మోహన్

సారంగాపూర్: ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు ఉదయం పది గంటల వరకే పనులు పూర్తి చేసుకోవాలని డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు అధికారి మదన్‌మోహన్ అన్నారు. మండలంలోని రంగపేట, నాగునూర్‌లో కూలీలు చేపడుతున్న కందిత కందకాలను బుధవారం పరిశీలించారు. కూలి, వేసవిభత్యం కలిపి కూలీలకు రోజు రూ.250 చొప్పున అందుతుందన్నారు. జూన్ ఒకటి వరకు ప్రతిరోజూ భార్యాభర్తలు పనుల్లో పాల్గొంటే రూ.20వేల వరకు అందుకునే అవకాశముందన్నారు. ఎంపీడీవో వెంకటేశం, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నరేశ్, అదనపు ప్రోగ్రాం అధికారి శ్రీలత, సాంకేతిక సహాయకులు శివ, ఫీల్డ్‌అసిస్టెంట్లు మల్లేశం, శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫార్మసీ లైసెన్స్ రద్దు

జగిత్యాల: నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో ఇటీవల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లోగల ఈఎన్టీ ఆస్పత్రిపై తెలంగాణ నార్కోటిక్ బ్యూరో, జిల్లా ఔషధశాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మాన్విత ఫార్మసీలోనే జగిత్యాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో మాన్విత ఫార్మసీకి సంబంధించిన రీటైల్, నార్కోటిక్ లైసెన్స్‌ను ఔషధ నియంత్రణ శాఖ అధికారులు రద్దు చేశారు. నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

ఆయిల్ పాం పంటల పరిశీలన



గోధూర్‌లో ఆయిల్ పాం తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటలను ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్ లోహియా, రాహుల్ బుధవారం పరిశీలించారు. మండలంలో 210 ఎకరాల్లో ఆయిల్ పాం సాగవుతోందని, రైతులకు మొదటి విడతగా ఎకరాకు ప్రభుత్వం రూ.4,200 చెల్లించిందని, రెండో విడత రూ.4,200 చెల్లించేందుకు తోటలను పరిశీలిస్తున్నామని తెలిపారు. రైతులు ఆయిల్ పాం సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఏఈవో రవళిక, రైతులు పాల్గొన్నారు.

'మత్తు' వదిలే దారేది?!

- డ్రగ్స్, గంజాయికి కేరాఫ్‌గా జగిత్యాల
- బానిసలుగా మారుతున్న యువత
- డీ–అడిక్షన్ సెంటర్లు నామమాత్రం
- అవగాహన లేక కౌన్సెలింగ్‌కు దూరం



ఖాళీగా కనిపిస్తున్న బెడ్లు



జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ఏర్పాటు చేసిన డీ–అడిక్షన్ సెంటర్

జగిత్యాల: జిల్లా గంజాయి, మద్యం కోరల్లో చిక్కుకుపోతోంది. ముఖ్యంగా యువత గంజాయి, మద్యానికి బానిసై పక్కదారి పడుతోంది. వీటిని అరికట్టేందుకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అయితే అవి నామమాత్రంగానే ఉన్నాయి. గంజాయి, మద్యం, సిగరెట్, హెరాయిన్ వంటి తదితర మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని వాటి నుంచి విముక్తులు చేయడానికి ఈ సెంటర్లను ఏర్పాటు చేశారు. కానీ సెంటర్‌పై అవగాహన లేకపోవడంతో అక్కడకు ఎవరూ వెళ్లడంలేదు. సెంటర్‌లో ఒక మానసిక వైద్యుడు, ఒక ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు, అటెండర్ ఉన్నారు. సరైన అవగాహన లేక అది నామమాత్రంగానే ఉంటోంది.

జిల్లాలో అల్లకల్లోలం

జిల్లాలో ఇటీవల ఓ మైనర్ బాలిక డ్రగ్‌కు అలవాటు కావడంతోపాటు అత్యాచారానికి గురై స్వధార్‌హోంలో చికిత్సపొందుతోంది. నిందితులపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇలా చాలామంది చిన్నారులు డ్రగ్స్‌కు అలవాటుపడగా తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలేక లోలోపల మదనపడుతున్నారు. వీరిలో ఉద్యోగుల పిల్లలు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. మైనర్లు ఎలాంటి మత్తుకైనా అలవాటుపడుతూ ఊహాలోకంలో తేలుతున్నారు. తాజాగా జిల్లాకేంద్రంలో కొందరు చిన్నారులు మంగళవారం కల్తీకల్లు తాగి బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. వారిని అడ్డుకోబోయిన చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులపైనా దాడులకు పాల్పడ్డారు. ఇలా నిత్యం ఏదో చోట ఘటనలు జరుగుతుండడంతో జిల్లా అల్లకల్లోలంగా మారింది. ఒకవైపు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి సైతం అత్యధికంగా రవాణా కావడం, మైనర్ బాలబాలికలు అలవాటు పడటంతో అందరికీ ఇబ్బందికరంగా మారింది.

క్యాంపులతో అవగాహన

జిల్లా కేంద్రంలో ప్రధాన కళాశాలలు ఉన్నాయి. జేఎన్‌టీయూ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, మెడికల్ కళాశాలలు ఇలా పెద్దపెద్ద కళాశాలలు ఉండగా ఇందులో క్యాంపులు ఏర్పాటు చేసి వీటిపై అవగాహన కల్పిస్తే కొంతమేర తగ్గే అవకాశాలుంటాయని మేధావులు అభిప్రాయపడుతున్నారు. వైద్యాధికారులు ఈ మత్తు పదార్థాలపై గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అవగాహన కల్పిస్తున్నారు. కానీ ఈ మధ్యకాలంలో జిల్లా కేంద్రంలోనే అత్యధికంగా చోటుచేసుకుంటున్నాయి.

క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం



డీ–అడిక్షన్ సెంటర్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశాం. ఇందులో ఒక సైకియాట్రిస్ట్, ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించాం. బాధితులకు మెరుగైన సేవలందిస్తాం. ఇంజినీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ కళాశాలల్లో క్యాంపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

డీ–అడిక్షన్ సెంటర్‌తో మేలు

మాదకద్రవ్యాలకు అలవాటు కాకుండా అరికట్టేందుకే జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌పై అవగాహన లేదు. డ్రగ్స్, మద్యపానం, సిగరెట్లు తాగడం వంటి వాటికి అలవాటైతే ఈ సెంటర్‌కు తీసుకెళ్తే సైకియాట్రిస్ట్ చూసి చికిత్స అందిస్తారు. ఇందులో సపరేట్ బెడ్స్ సైతం ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ఈ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఇందులో ప్రత్యేక వార్డు కూడా ఉంది. అయితే దీనిగురించి చాలా మందికి తెలియకపోవడం, అధికారులు వీటి ప్రాధాన్యత గురించి వివరించకపోవడంతో సెంటర్ నామమాత్రంగానే ఉంటోంది. ఇందులో మత్తు పదార్థాలకు బానిసలవ్వడం వల్ల కలిగే నష్టాలతో పాటు ఆ వ్యసనం నుంచి ఎలా విముక్తి పొందాలని వివరించడంతోపాటు తప్పనిసరి పరిస్థితుల్లో బాధిత కుటుంబ సభ్యుల అంగీకారంతో చికిత్స చేస్తారు. పిల్లల పరివర్తనలో మార్పులుంటే తల్లిదండ్రులు గమనించి ఈ సెంటర్‌కు తీసుకువస్తే తగ్గే అవకాశాలు ఉంటాయి.

జీవన్‌రెడ్డి 'చేతి'కి నిజామాబాద్ టికెట్

జగిత్యాల: కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా తాటిపర్తి జీవన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఆయన ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. పార్టీలో సీనియర్ అయిన జీవన్‌రెడ్డి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయినప్పటికీ ఆయనపై నమ్మకంతో పార్టీ అధిష్టానం ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. తనకే టికెట్ వస్తుందన్న నమ్మకంతో జీవన్‌రెడ్డి పార్లమెంట్ పరిధి మొత్తం ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు.

బయోడేటా



పేరు:	తాటిపర్తి జీవన్‌రెడ్డి
సామాజికవర్గం:	రెడ్డి
పుట్టిన తేదీ:	05–01–1951
విద్యార్హతలు:	బీఏఎల్ఎల్‌బీ (ఉస్మానియా)
తల్లిదండ్రులు:	లింగమ్మ, రామచంద్రారెడ్డి
భార్య:	అహల్య
కుమారులు:	రామచంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి, చంద్రకృష్ణారెడ్డి
స్వగ్రామం:	బతికెపల్లి, పెగడపల్లి మండలం
నివాసం:	జగిత్యాల

రాజకీయ అనుభవం:

ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా, వైఎస్.రాజశేఖర రెడ్డి మంత్రివర్గంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

వాస్తవాలు వక్రీకరించేలా హరీశ్‌రావు మాటలు

జగిత్యాలటౌన్: యాసంగి సీజన్ ప్రణాళిక రూపొందించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం కావడంతోనే సాగునీటి ఎద్దడి తలెత్తిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సారెస్పీ నుంచి గ్రావిటీ ద్వారా నీటి తరలింపులో సమస్య తలెత్తిందని, ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు నీటిని ఎత్తిపోస్తే సమస్య వచ్చేది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో యాసంగి ఆరంభంలోనే 10 నుంచి 12టీఎంసీల నీటి కొరత ఏర్పడిందన్నారు. తప్పులను కప్పి పుచ్చుకునేందుకు మాజీమంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యేగా, కేసీఆర్ తనయ కవిత ఎంపీగా ఉన్న సమయంలోనే రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయని తెలిపారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నారసింహ నమోస్తుతే..



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం 8వ రోజుకు చేరాయి. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఆలయం అన్ని వసతులు కల్పించింది. ముందుగా భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించారు. దేవాలయంలోని శేషప్ప కళావేదికపై శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వర భజన మండలి నిర్వహించిన భజనలు ఆకట్టుకున్నాయి.

జిల్లాలో 5.65 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తాం

- కలెక్టర్ యాస్మిన్ భాషా

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి సీజన్‌లో 5.65లక్షల టన్నుల వరి ధాన్యం దిగుబడి రానుందని, ఆ మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోళ్లపై అధికారులు, కొనుగోలు కమిటీలతో సమావేశమయ్యారు. జిల్లాలో 1.18 లక్షల హెక్టార్లలో వరి సాగైందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీ 133, సింగిల్‌విండో 282, మెప్మా ఒకటి చొప్పున మొత్తం 416 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో రెండు ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచుతామన్నారు. బస్తాకు 40.659 కిలోలు మాత్రమే తూకం వేయాలని, అదనంగా తూకం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్‌మిల్లర్లుగానీ, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలుగాని అవకతవకలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. మిల్లర్లు 50 నుంచి 60 మంది హమాలీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యంలో తప్ప, తాలు లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సీఎంఆర్ వెంటనే చెల్లించాలి

జగిత్యాల: వానాకాలం 2023–24కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను వెంటనే అప్పగించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. మిల్లర్లు తమ రైస్‌మిల్ సామర్థ్యానికి అనుగుణంగా సీఎంఆర్ చెల్లించాలని, ఇప్పటివరకు ఇవ్వని మిల్లర్లు వెంటనే ప్రారంభించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరసరఫరాల సిబ్బంది సీఎంఆర్ డెలివరీ విషయంలో ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, వెంకటేశ్వర్లు, హతీరాం పాల్గొన్నారు.

పరిశోధనలు పొలాల్లోకి చేరాలి



పంటల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రఘురామిరెడ్డి, ఇతరులు

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురామిరెడ్డి

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు పొలాల్లోకి చేరాలని, అప్పుడే రైతులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వరి విస్తీర్ణం 21శాతానికి పెరిగిందని, సోయాచిక్కుడు విస్తీర్ణం 10 శాతం పెరిగిందని, అయితే చెరుకు విస్తీర్ణం మాత్రం 73 శాతం, పెసర 61 శాతం, మొక్కజొన్న 12 శాతం, కందుల విస్తీర్ణం 8శాతం, పత్తి విస్తీర్ణం నాలుగు శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జగిత్యాలరూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ సిఫారసు చేసిన ఎరువుల కంటే భూసార పరీక్షల ఆధారంగా వాడితే 22.5 శాతం అధిక దిగుబడి వస్తుందని, ఇది శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలిందని గుర్తు చేశారు. మొక్కజొన్నలో స్ప్రేయర్ ద్వారా కాకుండా డ్రోన్ ద్వారా కలుపు మందులు పిచికారీ చేస్తే మేలన్నారు. వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ సుధారాణి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. పంట దిగుబడే ప్రధానం కాదని, భూమిని సంరక్షించడం అంతే ముఖ్యమన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలోని పొలాస, కూనారం, రుద్రూర్ పరిశోధన స్థానాల నుంచి రూపొందించిన జేజీఎల్–33124, జేజీఎల్ -28639, జేజీఎల్ -35085, జేజీఎల్–34560, కేఎన్ఎం–7037, ఆర్‌డీఆర్–1200, ఆర్‌డీఆర్–1162 రకాలు అనేకరకాల రోగాలను తట్టుకుని మంచి దిగుబడి ఇచ్చాయన్నారు. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ బాలు మాట్లాడుతూ వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతు సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకరావాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు తమ పరిశోధన స్థానాల్లో వానాకాలం, యాసంగి సీజన్‌లో చేసిన పరిశోధనలు, చేస్తున్న పరిశోధన ప్రగతిని ఫొటో ప్రజెంటేషన్ ఇచ్చారు. రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. అనంతరం వివిధ పంటల సాగుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

32 ఎకరాల్లో వరి సాగు



32 ఎకరాల్లో వరి సాగు చేశాను. 20ఏళ్ల క్రితం ఎకరాకు 30 క్వింటాళ్లు వస్తే.. ఇప్పుడు అంతే దిగుబడి వచ్చింది. శాస్త్రవేత్తల పరిశోధనలు ఎటు పోతున్నాయి..? సాగు ఖర్చు పెరిగిందిగానీ రైతులకు వచ్చే ఆదాయం ఏమీ లేదు.

– కిశోర్‌బాబు, కామారెడ్డి జిల్లా

14 ఎకరాల్లో పంటలు



14 ఎకరాల్లో వరి, పత్తి పంటలు వేశాను. ఏటా వాతావరణం అనుకూలించక ఆశించిన రీతిలో దిగుబడి రావడం లేదు. దీంతో పంటకు పెడుతున్న పెట్టుబడికి.. వచ్చే ఆదాయానికి పొంతన లేకుండా పోయింది.

– రవీందర్ రెడ్డి, సిరిసిల్ల

ఏకకాలంలో మూడు పంటలు



వానాకాలంలో పసుపు, తర్వాత నువ్వు, తర్వాత అరటి సాగు చేశాను. ప్రస్తుతం 50 గుంటల అరటికి రూ.రెండు లక్షలు వస్తున్నాయి. సాగులో వస్తున్న కొత్త పద్ధతులు రైతులకు అందడం లేదు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి రావాలని రైతులు ఆశిస్తున్నారు.

– బద్దం లక్ష్మారెడ్డి, కోరుట్ల

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్: తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతిచెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య (35)కు భార్య పోశాని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణకు గ్రామంలో పశువులకాపరిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం పశువులతో గ్రామశివారులోకి వెళ్లిన ధర్మయ్యపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో ధర్మయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. ధర్మయ్య భార్య పోశాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వెన్నంపల్లి గ్రామానికి చెందిన వెల్తూరి మణెమ్మ(49) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మణెమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి తీవ్రం కావడంతో భరించలేక సోమవారం రాత్రి పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంగనర్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలికి భర్త సుదర్శన్, కుమారుడు ఉపేందర్ ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి..

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని బుడగ జంగం కాలనీకి చెందిన ఓ చిన్నారి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... కాలనీకి చెందిన మోటం కనకయ్య కూతురు రిషిత(ఏడాదిన్నర వయస్సు) ఈ నెల 25న సాయంత్రం ఆడుకుంటూ పక్క ఇంటికి వెళ్లింది. ఆ ఇంట్లోని పొయ్యి మీద పెట్టిన డికాషన్ ప్రమాదవశాత్తు చిన్నారి మీద పడగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

సారంగాపూర్: మండలంలోని మ్యాడారంతండా పంచాయతీ పరిధి తలుపులతండాకు చెందిన మోతె నర్సవ్వ (49)చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం నర్సవ్వకు చాలారోజులుగా మానసిక స్థితి సరిగాలేదు. ఈనెల 17న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన ఆమె భర్త పోశం ఆమెను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితంలేదు. నర్సవ్వకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థి శవం లభ్యం

తిమ్మాపూర్: జిల్లాలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యం కాగా.. బుధవారం బావిలో శవమై కనిపించాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన అభిలాశ్ (20) ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని హాస్టల్లో ఉంటున్నాడు. ఈనెల 2 నుంచి కనిపించడం లేదని ఆయన తండ్రి శ్రీనివాస్ ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈక్రమంలో బుధవారం మహాత్మనగర్ శివారులోని జ్యోతిబాపూలే పాఠశాల సమీపంలోని గవ్వ రవీందర్ రెడ్డి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. కరీంనగర్ ఆస్పత్రి వైద్యులు అక్కడే శవపరీక్ష చేశారు. కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయనే తండ్రి ఫిర్యాదు మేరకు ఆ కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై చేరాలు వివరించారు.

కమీషన్ కోసం ఎదురుచూపు

- ధాన్యం కొనుగోలు చేసిన ఐకేపీ, సహకార సంఘాలు
- జిల్లాకు రూ.35.45 కోట్లు పెండింగ్
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు



పెగడపల్లి: బతికపల్లిలో తేమశాతం పరిశీలిస్తున్న నిర్వాహకులు

పెగడపల్లి: కష్టనష్టాలకోర్చి ధాన్యం కొనుగోలు చేసిన నిర్వాహకులకు కమీషన్ అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా కొనుగోళ్లు చేపడుతున్న విషయం విదితమే. ఇలా 2022–23 వానకాలం, 2022–23 యాసంగి, 2023–24 వానాకాలం (మూడు సీజన్లు)కు సంబంధించి కమీషన్ సొమ్ము రూ.35కోట్ల45లక్షల54వేలు రావాల్సి ఉంది. తమకు రావాల్సిన కమీషన్ సొమ్ము చెల్లించాలని ఐకేపీ, సహకార సంఘాల కేంద్రాల నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు మాత్రం డబ్బులు విడుదల కాగానే జమ చేస్తామని చెబుతున్నారు. మూడు పంటల కమీషన్ సొమ్ము రాకకోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా మద్దతు ధర కల్పించేందుకు గ్రామాల్లో ప్రభుత్వమే ఏటా వానకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. పౌర సరఫరాలశాఖ నుంచి ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోళ్ల కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా వాటికి కొంత కమీషన్ వస్తోంది. క్వింటాల్ ధాన్యం కొనుగోలు చేస్తే రూ.32 కమీషన్ రూపేణా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ కమీషన్ వస్తుందనే ఉద్దేశంతో ఐకేపీ, సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. మూడు సీజన్ల కమీషన్ పెండింగ్‌లో ఉంది. 2022–23వానకాలంలో 11,61,872 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా.. సంఘాలకు రూ.10కోట్ల75లక్షల77వేలు కమీషన్ రావాల్సి ఉంది. సహకార సంఘాల ఆధ్వర్యంలో 2022–23 వానకాలంలో 2,61,856 క్వింటాళ్లు, యాసంగిలో 2,94,934 క్వింటాళ్లు, 2023–24 యాసంగిలో 2,12,865 క్వింటాళ్ల చొప్పున మొత్తం 77,96,56లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఇందుకు సహకార సంఘాలకు ధాన్యం సొమ్ము కమీషన్ రూపేణా రూ.24 కోట్ల 65 లక్షల77వేలు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా జిల్లాలో మూడు సీజన్లకు రూ.35కోట్ల45 లక్షల 55 వేలు ప్రభుత్వం కమీషన్ రూపేణా విడుదల చేయాల్సి ఉంది. ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతులు పండించిన పంటకు సంబంధించి ప్రతి గింజను కొనుగోలు చేయాలని అప్పటి ప్రభుత్వం పౌర సరఫరాలశాఖను ఆదేశించడంతో ఒక్కో సీజన్‌లో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించారు.

కమీషన్ విడుదల చేయాలి



మూడు పంట కాలాలకు చెందిన ధాన్యం కమీషన్ డబ్బులు రావాల్సి ఉంది. డబ్బులు చెల్లిస్తే సంఘం అభివృద్ధికి వినియోగించుకుంటాం. ఈ పంట కొనుగోలు కోసం కేంద్రాల ఏర్పాటుకు చేసేందుకు సిద్ధమవుతున్నాం. పెండింగ్‌లో ఉన్న కమీషన్ చెల్లిస్తే కేంద్రాల నిర్వహణకు ఉపయోగపడుతాయి.

– గట్టు కొమురవ్వ, గ్రామ సంఘం అధ్యక్షురాలు, పెగడపల్లి

సంఘాల అభివృద్ధికి



సహకార సంఘాలకు కేంద్రాల నిర్వహణ అప్పగించారు. కేంద్రాల ద్వారా సమకూరే కమీషన్ డబ్బులు ప్రభుత్వం వెంటవెంట చెల్లిస్తే సహకార సంఘాలను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుంది. మా సంఘానికి మూడు పంటలకు చెందిన సుమారు రూ.80 లక్షలు కమీషన్ రావాల్సి ఉంది.

– వోరుగంటి రమణారావు, పీఏసీఎస్ చైర్మన్ పెగడపల్లి

నిధులు రాగానే విడుదల చేస్తాం



నిర్వాహకులకు కమీషన్ డబ్బులు విడుదల కావాల్సి ఉంది. రాగానే ఆయా కేంద్రాలకు అందిస్తాం. జిల్లాలో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. ఇందుకు మూడు పంటలకు చెందిన కమీషన్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వానికి కమీషన్ డబ్బుల విడుదల కోసం ప్రతిపాదనలు పంపించాం.

– వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి.

మామిడికి చీడపీడలు

- పిందే సమయంలోనే పండుబారుతున్న కాయ
- వాతావరణ ప్రభావమంటున్న అధికారులు



నేల రాలిన పిందే



మామిడి పంటకు పురుగుల మందును స్ప్రేచేస్తున్న రైతులు

సారంగాపూర్: వాతావరణంలోని మార్పుల కారణంగా ఈ ఏడాది కూడా నష్టాలు మిగిల్చేలా ఉందని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చిలో వాతావరణంలో మార్పులు రావడం, మబ్బులు పట్టడం, చెదురుమదురుగా చిరుజల్లులు కురవడంతో తోటలపై తీవ్ర ప్రతికూలతను చూపి, కాయ పెరిగే సమయానికి నేల రాలుతుండడంతో దిగుబడి గణనీయంగా పడిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రెండు మండలాల్లో మామిడి సాగు

సారంగాపూర్ మండలంలో 420 ఎకరాల్లో, బీర్‌పూర్‌లో 78 ఎకరాల్లో మామిడితోటలు సాగవుతున్నాయి. దిగుబడి పెంచడానికి రైతులు తోటలకు ఇప్పటికే సేంద్రియ, రసాయనిక ఎరువులు, మూడు పర్యాయాలు వివిధ పురుగుల మందులను స్ప్రే చేసారు. తద్వారా రైతుకు పెట్టుబడి తడిసి మోపెడయ్యాయి. మార్చి చివరి వారంలో మామిడి కాయలు కనీసం 200 గ్రాముల బరువును దాటిపోవాలి. కానీ కాయ సైజు ఏమాత్రం పెరగకపోగా.. ఉన్న కాతనే రాలిపోతోంది. మూడు నెలలుగా మామిడిని తేనెమంచు, బూడిద తెగులు, మసి తెగులు, తామర పురుగులు ఆశించాయి. దీంతో పూత మాడిపోయి రాలిపోయింది. కాయలు పిందే దశలో ఆకుపచ్చ రంగు నుంచి పసుపు రంగులోకి మారాయి. పంటకు ఎన్ని నీటితడులు అందించినా కాత నిలవడం లేదు. అధికారుల సూచనలతో ప్రతి రైతు ఇప్పటికే మూడుసార్లు వివిధ రకాల పురుగుల మందులను స్ప్రే చేశారు. అయినా కాత ఆగకపోవడంతో రైతులకు ఈ ఏడాది భారీ నష్టం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

గతేడాది వడగళ్లతో నష్టం

గతేడాది తెగుళ్ల కంటే ఎక్కువ ఏప్రిల్‌లో కాయ తెంపే సమయంలో భారీ వడగళ్లు.. ఈదురుగాలులతో కూడిన వర్షాలకు కాత నేల రాలిపోయింది. అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు అందిస్తామని ప్రకటించినా అది అందలేదు.

ఆరున్నర ఎకరాల్లో పంట దెబ్బతింది



నాకున్న ఆరున్నర ఎకరాల్లో మామిడి తోట పూర్తిగా దెబ్బతిన్నది. ఇప్పటికే పలుమార్లు మందులను పిచికారీ చేశాను. అయినా చీడపీడలు అదుపులోకి రావడం లేదు. ప్రస్తుతం మంగు వచ్చి సైజు పెరగడం లేదు. కాయ దిగుబడి భారీగా తగ్గుతుంది.

– ఎడమల మహిపాల్‌రెడ్డి, రేచపల్లి

తోటలకు తెగుళ్లు సోకాయి



జిల్లా మొత్తంగా మామిడి పంటపై తేనె మంచు, తామర పురుగు తీవ్రత ఎక్కువగా ఉంది. వీటి కారణంగా మామిడి పంటలో దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉంది. దీని నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

– స్పందన, హార్టికల్చర్ అధికారి

రెవెన్యూ, ఫారెస్ట్ భూమిపై జాయింట్ సర్వే



జాయింట్ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లోగల రెవెన్యూ, అటవీశాఖ భూమిపై ఆయాశాఖల అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన నిమ్మల మల్లేశ్, వెలిచాల పెద్ద గంగారం, వెలిచాల గంగు, నిమ్మల రాజగంగు సర్వే నంబర్ 87, 131లో పంటలు పండించుకుంటున్నారు. ఆ భూమి తమదంటూ అటవీశాఖ అధికారులు సాగును అడ్డుకుంటున్నారని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీవో శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్‌అలీ ఆధ్వర్యంలో జయింట్ సర్వేను నిర్వహించారు. సర్వే నంబర్ 131లో 648 ఎకరాల భూమి ఉండగా, 1968లో 130 ఎకరాలు అటవీశాఖకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. జాయింట్ సర్వే పూర్తయ్యాక అటవీశాఖ భూమా..? రెవెన్యూ శాఖ భూమా..? నిర్ధారణ చేసి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో షౌకత్‌అలీ, ఏడీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ వేవరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, ఆర్ఐ గంగాధర్, ఫారెస్ట్ బీట్ అధికారి రత్నకర్, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో రూ.55 వేలు సీజ్

సారంగాపూర్: ఎన్నికల నిబంధనల్లో భాగంగా బుధవారం సారంగాపూర్ పోలీసులు కోనాపూర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సరైన పత్రాలు లేకుండా ఓ వ్యక్తి రూ.55వేలు తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆ మొత్తాన్ని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఓపెన్ జిమ్‌కు మరమ్మతు

కోరుట్ల: పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న ఓపెన్ జిమ్‌కు బుధవారం అధికారులు మరమ్మతు చేయించారు. జిమ్‌కు మరమ్మతు చేయించాలని పలువురు ఎమ్మెల్యే సంజయ్‌కు విన్నవించారు. ఆయన సూచనల మేరకు మరమ్మతు చేసినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, అధికారులు పరిశీలించారు.

ఏఐఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా గంగారెడ్డి



బుగ్గారం: ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామానికి చెందిన చుక్క గంగారెడ్డి ఎన్నికయ్యారు. ఏఐఎంఏ ఆధ్వర్యంలో ఈనెల 17న ఆన్‌లైన్ పద్ధతిన నిర్వహించిన ఓటింగ్ ఫలితాలను బుధవారం వెల్లడించారు. ఈ పోలింగ్‌లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవి కోసం పోటీలో నిలవగా.. చుక్క గంగారెడ్డి 79 శాతం ఓట్లు సాధించి భారీ విజయం సొంతం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన అసోసియేషన్‌కు, తనకు ఓట్లు వేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ బలోపేతానికి, జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఓటు హక్కుపై ధర్మపురిలో 5కే రన్

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోంచుకోవాలని రిటర్నింగ్ అధికారి దివాకర్ అన్నారు. పట్టణంలో బుధవారం 5కే రన్ చేపట్టారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి గాంధీ, నందీచౌక్ మీదుగా రన్ కొనసాగింది. 18ఏళ్లు పైబడిన వారంతా విధిగా ఓటు వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘యశోద’లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్



మాట్లాడుతున్న డాక్టర్ గణేశ్ జైషెత్వార్

కరీంనగర్‌టౌన్: బ్లడ్ కేన్సర్‌కు సంబంధించి యశోద ఆస్పత్రి హైటెక్‌సిటీలో అత్యాధునిక పద్ధతిలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తున్నట్లు ఆస్పత్రి హెమటాలజిస్టు, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్టు డాక్టర్ గణేశ్ జైషెత్వార్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో బ్లడ్ కేన్సర్, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్‌పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లడ్ కేన్సర్ వచ్చిన వారికి బ్లడ్ ఉత్పత్తి తగ్గిపోతుందని, ఫలితంగా 6 నెలలకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. ఇది ఏ వయసు వారికైనా లింగభేదం లేకుండా వస్తుందని, మన దేశంలో ఏడాదికి లక్ష జనాభాకు 5.5 కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతీ 20 సెకన్లకు ఒకరు బ్లడ్ కేన్సర్‌తో మరణిస్తున్నారని, రాష్ట్రంలోనూ ఈ కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాధి రావడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. జిల్లాకు చెందిన మురళి అనే వ్యాపారి బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతుండగా అతని సోదరి నుంచి స్టెమ్‌సెల్ సేకరించి, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు. అలాగే, 13 ఏళ్ల బాలికకు ఆమె తల్లి నుంచి స్టెమ్‌సెల్ సేకరించి, చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వీరిద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, సాధారణ జీవితం గడుపుతున్నారని అన్నారు. బ్లడ్ కేన్సర్ వచ్చిందని భయపడాల్సిన పనిలేదని, యశోద ఆస్పత్రి హైటెక్‌సిటీ బ్రాంచిలో అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు.

లెజియన్ ఫాకో మెషిన్ ప్రారంభం



కంటి పరీక్ష చేసుకుంటున్న చిన జీయర్ స్వామి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రిలో రూ.37 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన లెజియన్ ఫాకో మెషిన్‌ను చిన జీయర్ స్వామి బుధవారం ప్రారంభించారు. దీని ద్వారా అతి చిన్న గాటుతో కేటరాక్ట్ ఆపరేషన్లు చేయవచ్చని వైద్యులు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన చిన జీయర్ స్వామి రోగులను పరామర్శించారు. ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులు, వైద్యులకు మంగళశాసనాలు అందజేశారు. ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, కోశాధికారి బొమ్మ పవన్, ట్రస్ట్ సభ్యులు మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కోదండరాములు, మోర బద్రేశం, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

- తాగిన మైకంలో భార్యపై రాడ్‌తో దాడి
- అక్కడికక్కడే చనిపోయిన భార్య
- అనాథగా మారిన ఒక్కగానొక్క కూతురు

వెల్గటూర్ : మద్యం మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఓ వ్యక్తి కట్టుకున్న భార్యను రాడ్‌తో కొట్టి చంపిన సంఘటన ఎండపల్లి మండలం మారేడుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మారేడుపల్లికి చెందిన వ్యాళ్ల పున్నంరెడ్డికి ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రజితతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు అక్షిత రెడ్డి(11) జన్మించింది. కొద్దిరోజులుగా పున్నంరెడ్డి మద్యానికి బానిసయ్యాడు. అప్పటినుంచి భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అతిగా మద్యం సేవించిన పున్నంరెడ్డి అర్ధరాత్రి సమయంలో భార్య రజితతో గొడవ పడ్డాడు. మాటామాటా పెరగడంతో రజిత(38)ను ఇనుపరాడ్‌తో బలంగా కొట్టడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. రజిత మృతదేహాన్ని చూసి బంధువులు గుండెలవిసేలా రోదించారు. రజితకు కూతురు అక్షిత రెడ్డి తలకొరివి పెట్టింది. రజిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి రజిత కాటికి.. తండ్రి జైలుకు వెళ్లడంతో వారి కూతురు అనాథగా మారింది.

పురుగుల మందు తాగిన ప్రభుత్వ ఉద్యోగి

- సకాలంలో ఆస్పత్రిలో చేర్పించిన కానిస్టేబుల్



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మణికుమార్ వద్ద కానిస్టేబుల్ జుబేర్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి పురుగుల మందు తాగాడు. ఆ వెంటనే 100కు డయల్ చేశాడు. స్పందించిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అతడిని సకాలంలో ఆసుపత్రిలో చేరించారు. ములుగు జిల్లా వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మణికుమార్ భార్య జగిత్యాలలోని ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తోంది. ఇటీవల ఇద్దరి మధ్య తరుచూ గొడవలు కావడంతో మణికుమార్ జగిత్యాలకు వచ్చాడు. బుధవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురై గొల్లపల్లి రోడ్‌లోని తిమ్మాపూర్ చౌరస్తా వద్ద పురుగుల మందుతాగాడు. వెంటనే 100కు డయల్ చేయడంతో వారు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో కానిస్టేబుల్ జుబేర్ సత్వరమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మణికుమార్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సత్వరమే స్పందించిన జుబేర్‌ను స్థానికులు అభినందించారు.

పరువు పోతుందని యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ తీగల వంతెన వద్ద సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి (28) బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు ఓ యువతి కారణమంటూ సూసైడ్ నోట్ రాశాడు. ఆరేళ్లుగా కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డికి ఇటీవల పెళ్లి సంబంధం చూశామని తండ్రి దూది రఘుపతిరెడ్డి తెలిపారు. అయితే అదే హోటల్‌లో పనిచేస్తున్న ఓ యువతి బ్లాక్ మెయిల్ చేస్తూ తన కుమారుడిని పెళ్లి చేసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. ఈ నెల 23న నలుగురు వ్యక్తులతో కలిసి మల్లాపూర్ గ్రామానికి వచ్చి పరువు తీసిందని ఆరోపించారు. మళ్లీ గ్రామానికి వస్తానని బెదిరించడంతో పరువు పోతుందనే భయంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్‌లు ఢీకొని కార్మికుడి మృతి

పెద్దపల్లిరూరల్: అందుగులపల్లి వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(58) అనే కార్మికుడు మరణించాడు. బసంత్‌నగర్ సిమెంట్ కర్మాగారంలో పనిచేసే పుట్ట మల్లయ్య.. తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. వెంటనే స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.1.11 కోట్లు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి వారి ఆలయానికి భక్తుల ద్వారా వచ్చిన హుండీల ఆదాయాన్ని బుధవారం ఆలయ ఈవో చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించారు. 48రోజులకుగాను రూ.కోటి 11లక్షల7329 నగదు, 74 గ్రాముల మిశ్రమ బంగారం, 5.5కిలోల మిశ్రమ వెండి, 40 విదేశీ కరెన్సీనోట్లు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ వరంగల్ పరిశీలకులు జి.సంజీవరెడ్డి, ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్‌లు శ్రీనివాస శర్మ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.